తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్

గురువారం 15 మే 2026 | పేజీలు - 8


# అంతా గప్‌చుప్..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/చిట్యాల, (జనంసాక్షి): ఎమ్మార్పీపై ఎంతైనా అదనంగా వసూలు చేసుకోండి.. అసలు పట్టించుకోం.. నకిలీ మద్యం తయారుచేసినా తెలియనట్టు నటిస్తాం.. అక్రమాలు ఎన్నిఉన్నా మీపై ఈగనైనా వాలనివ్వం.. ఇదీ ఇక్కడి ఎక్సైజ్ అధికారుల పనితీరు.. చిట్యాల సిండికేట్ దందాపై వైన్ షాపులను తనిఖీ చేసిన ఎక్సైజ్ పోలీసులు అంతా గప్..చుప్ అయ్యారు.. మొక్కుబడిగా అలా వెళ్లి ఇలా వచ్చారు.. బెల్ట్ షాపులకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్ షాపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.. వ్యాపారులతో కుమ్మక్కై బేరం కుదుర్చుకున్నట్లు ఈ ప్రాంతంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..**

## చుట్టపు చూపుగా వెళ్లొచ్చారు..

- చిట్యాల సిండికేట్ దందాపై ఎక్సైజ్ పోలీసుల తీరు ఇది
- మొక్కుబడిగా తనిఖీలు
- బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు..?
- అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న వైన్ షాపుపై చర్యలు శూన్యం





జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలమండలంలో జరుగుతున్న మద్యం వ్యాపారుల సిండికేట్ దందాపై 'జనంసాక్షి' మినీలో 'చిట్యాలలో దర్జాగా సిండికేట్ దందా' టైటిల్ తో సోమవారం ప్రచురితమవగా, 'కదలని అధికారులు.. అగని దందా' టైటిల్ తో మంగళవారం ప్రచురితమైంది. రెండు రోజుల పాటు ప్రచురితమైన ఈ వరుస కథనాలు జిల్లాలో సంచలనాత్మకంగా మారి చర్చకు తెరలేపాయి. దీంతో ఎటూ పాలుపోని స్థితిలో ఉన్న భూపాలపల్లి ఎక్సైజ్ పోలీసులు ఎట్టకేలకు మంగళవారం కదిలారు. విచారణ నిమిత్తం చిట్యాల వైన్ షాపులను నామమాత్రంగా తనిఖీ చేసి, చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపు నిర్వాహకులకు అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ, వారికి ఒక వైన్ షాపు సపరేటు ఏర్పాటు చేశారు. అయితే ఎక్సైజ్ పోలీసులు మొక్కుబడిగా వెళ్లి ఈ షాపులో రికార్డులు, మద్యం నిల్వలు తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వైన్ షాపును సీజ్ చేయకుండా, ఎలాంటి చర్యలు లేకుండా బేరం కుదుర్చుకుని వెనుదిరిగినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

### వ్యాపారులకు అండగా నిలిచిన 'ముడుపుల' బంధం..?

ముడుపుల బంధమే మద్యం వ్యాపారులకు అండగా మారిందా.. అనే ప్రశ్నలు జిల్లాలో ఉత్పన్నమవుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించే మద్యం వ్యాపారులపై కొరడా ఝులిపించాల్సిన ఎక్సైజ్ పోలీసులే, వారికి వెన్నుదన్నుగా నిలిచి అవినీతి, అక్రమాలను ప్రోత్సహించడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం వ్యాపారుల నుంచి ఏటా లక్షలాది రూపాయలు మామూళ్లు వసూలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు వారి అక్రమాలకు కొమ్ముకాస్తున్నారు. నకిలీ మద్యం, అధిక ధరల విక్రయాలు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన వంటి విషయాల్లో కఠినంగా వ్యవహరించాల్సింది పోయి. నిబంధనలు ఉల్లంఘించిన వైన్ షాపుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా బేరం మాట్లాడుకుని రావడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. మద్యం దుకాణదారుల నుంచి ఎక్సైజ్ అధికారులకు నెలవారీ మామూళ్ల వ్యవహారం ఈ ప్రాంతంలో బహిరంగ రహస్యంగా మారింది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘించిన చిట్యాల వైన్ షాపులపై తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా నిబంధనలు పాటించని చిట్యాల వైన్ షాపులు, వాటి తనిఖీ విషయమై వివరణ కోరేందుకు ఎక్సైజ్ అధికారులకు పలుమార్లు ఫోన్లు చేసినా స్పందించకపోవడం గమనార్హం.



## తాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)
- మక్కలు, దాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి
- కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి

**మహబూబాబాద్ బ్యూరో,మే 13(జనం సాక్షి):** గ్రామాల్లో తాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అధ్యక్షతన జిల్లా స్థాయి అభివృద్ధి పనుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు, మహబూబాబాద్ ఎం.పి పోరిక బలరాం నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో అత్యంత అధిక ప్రాధాన్యతగా త్రాగునీటి సమస్య రాకుండా క్షేత్రస్థాయిలో పంచాయతీ రాజ్ గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగాలని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినందున పద్దుల వారీగా ఖర్చులు చేసి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం ధాన్యం మొక్కజొన్న ల మిగతా 9లో..

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలి

- నాణ్యమైన విద్య ప్రమాణాలకు చిరునామగా ప్రభుత్వ పాఠశాలలు
- అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిరంతరాయంగా శ్రమిస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, మే 13(జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలని, నాణ్యమైన విద్య ప్రమాణాలకు చిరునామగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తున్నాయని, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు నిరంతరాయంగా కృషి చేస్తూ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక విద్య వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యా కార్యక్రమాలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర గేయాలపన తో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలని, విద్య ప్రమాణాలు పెంపొందించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి గ్రామాలలో, మున్సిపాలిటీ పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తూ పాఠశాలలో 100 శాతం విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చూడాలన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి అన్ని జిల్లాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని తెలిపారు. సమాజ నిర్మాణంలో మిగతా 9లో..

# ఉపాధి హామీ పనులు ఆకస్మిక పరిశీలన

## అడిషనల్ డిఆర్డిఓ నాగవర్ధన్



**లక్ష్మణ చందా, మే 13 (జనం సాక్షి)** మండల కేంద్రంలోని వద్యల్ , పీచర గ్రామాలలో ఉపాధి హామీ పనులను అడిషనల్ డిఆర్డిఓ నాగవర్ధన్ ఆకస్మికంగా పని ప్రదేశంలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ వద్యల్ గ్రామంలో జరుగుతున్నటువంటి కేనాల్ పనులను, పీచర గ్రామంలో జరుగుతున్న చెరువులో పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో వారు మాట్లాడుతూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం సరిగా కలిపిస్తున్నారని, పని ప్రదేశంలో టెంటు మరియు నీటి సౌకర్యం కూడా ఉంచుతున్నారని, పనులకు ఎటువంటి ఆటంకాలు కలిగించడం లేదని కూలీలు మాట్లాడారు. హాజరైన ప్రతి ఒక్కరికి 307 రూపాయలు వేతనం కల్పిస్తున్నారని ప్రత్యక్షంగా పని ప్రదేశంలో కూలీలు చెప్పడం జరిగింది. మరియు హాజరు కాని వారికి ఎటువంటి వేతనాలు చెల్లించడం లేదని వారు తెలిపారు. పేదవారికి ఈ ఉపాధి హామీ పని చాలా ఉపయోగకరంగా ఉందని కూలీలు తెలిపారు. అడిషనల్ డీఆర్డిఓ నాగ వర్ధన్ మాట్లాడుతూ పనులను ఇద్ద విధంగా సక్రమంగా నిర్వహించాలని కోరుతూ హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వివో బిల్డింగ్ పనులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పసుపుల నరేష్, హెచ్ ఆర్ మేనేజర్ సుధాకర్, ఏపీ ఓ ప్రమీల, టి ఏ దినేష్, భీమ్ లు మరియు పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ మెంబర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు, కూలీలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల పెంపునకు సహకరించాలి

- జీపీ కార్యదర్శికి అధ్యాపకుల వినతి



**కుబీర్, మే 13, (జనంసాక్షి):** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ల పెంపునకు సహకరించాలని కోరుతూ కళాశాల అధ్యాపకులు బుధవారం కుబీర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవ్‌ను కలిశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించేలా గ్రామ పంచాయతీ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని వారు కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. విశాలమైన తరగతి గదులు, సుసజ్జితమైన సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులచే నాణ్యమైన బోధన అందిస్తున్నామని, గ్రామీణ విద్యార్థులకు ఈ సౌకర్యాలపై అవగాహన కల్పించి అధిక సంఖ్యలో అడ్మిషన్లు పొందేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కార్యదర్శి సానుకూలంగా స్పందించారు.

## విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలి



**నెరడిగొండ మే13(జనంసాక్షి):** విద్యార్థులు చదవుతోపాటు విషయ పరిజ్ఞానం ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ శబనాతరన్నం అన్నారు. బుధవారం రోజు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లోభాగంగా మూడో రోజు కమ్యూనిటీ పార్టిసిపేషన్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు .గ్రామస్తులకు విద్యార్థులకు వివిధ విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షబానాతరన్నం మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విష యాలపై అవగాహన కలిగి ఉండాలని చదువుతోపాటు విషయ పరిజ్ఞానం ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ప్రజాస్వామ్యం కూని చేయబడుతుంది

- బాలికలకు రక్షణ లేదు అనడానికి బండి భగీరథ వ్యవహారమే ఉదాహరణ
- బేటి బచావో నినాదం ఎక్కడుంది
- మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ ఈస్ట్, మే 13 (జనం సాక్షి)** దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ చేయబడుతుందని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ చౌరస్తాలో బిజెపి పార్టీ ప్రజల పట్ల అవలంబిస్తున్న విధానాలు, బిజెపి నాయకులు సామాన్యుల పట్ల చేస్తున్న అఘాయిత్యాలను నిరసిస్తూ శ్రీరాముని విగ్రహానికి పూజలు చేసి, వినూత్నంగా నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ2014లో 'చాయ్ వాలా' అని చెప్పి ప్రజలను నమ్మించిన మోదీని గెలిపిస్తే మహిళలకు భద్రత కరువైంది అన్నారు. 'చట్ట ప్రకారం, న్యాయ ప్రకారం అని చేసిన ప్రమాణం ఏమైంది? బేటీ బచావో' నినాదం ఎక్కడ ఉంది? అని ప్రశ్నించారు. బాలికలకు రక్షణ లేదని చెప్పడానికి బండి సంజయ్ కుమారుడి వ్యవహారమే పెద్ద ఉదాహరణ అన్నారు. మాకు అన్యాయం జరిగింది" అని బాధితురాలు చెబితే మాట్లాడేది లేదని బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. తాము చూస్తూ ఊరుకోం. సామాజిక న్యాయం కోసం పోరాడతాం అని నరేందర్ చెప్పారు. బాధితులపైనే ఉల్టా కేసులు పెడుతున్నారు. ప్రధాని భద్రతకు, కేసు ఆలస్యానికి సంబంధం ఏమిటి అలాంటి వ్యక్తిని ప్రధాని పక్కన పెట్టుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆలస్యంగా కమిటీ వేశారు. ఎందుకు ఈ కమిటీ? నిందితుడు భగీరథ్ 'ప్రజల మధ్యనే ఉన్నాను' అంటున్నాడు. కానీ పోలీసులు 'దొరకడం లేదు' అంటున్నారు. ఏది నిజం అన్నారు. బండి సంజయ్ వరంగల్‌కు వచ్చి బురద చల్లి పోయాడు. నేను సవాల్ చేస్తున్నా – ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అన్నారు. అబద్ధాన్ని నిజం చేయడంలో బీజేపీ ముందుంటుంది. స్థానిక బీజేపీ నాయకులు ఎందుకు మాట్లాడటం లేదు? అన్నారు. నాలుగోసారి నీట్ రద్దుకు కేంద్రమే బాధ్యత వహించాలి. ఉత్తరాదిన ప్రజాధనాన్ని దోచుకుంటూ, దక్షిణాదిని అవహేళన చేస్తున్నారు అన్నారు. ఉద్యోగాల కోసం, విద్య కోసం జరిగిన పరీక్షలు 65 సార్లు లీక్ అయ్యాయి. 'ధర్మం కోసం, న్యాయం కోసం' అని చెప్పడం కాదు. ధర్మం న్యాయం చేసి చూపించాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన జనగణనతోనే అభివృద్ధికి బలమైన పునాది

- అవగాహన ర్యాలీలో ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే . కలెక్టర్




**హనుమకొండ ప్రతినిధి మే 13 (జనం సాక్షి):** జనగణన--2027లో ప్రతి పౌరుడు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేలా అవగాహన కల్పించేందుకు బుధవారం హనుమకొండ నగరంలో భారీ అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరించారు. ఈ అవగాహన ర్యాలీ హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ సర్కిల్ నుంచి ప్రారంభమై భీమారం సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీ మొత్తం దేశాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, ఖచ్చితమైన సమాచారం ప్రాముఖ్యతను తెలియజేసే నినాదాలతో ఆకట్టుకుంది. ర్యాలీ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి, "జనగణన--2027లో తప్పనిసరిగా పాల్గొని, మా కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకుని దేశ అభివృద్ధికి సహకరిస్తాం" అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ, జనగణన కేవలం లెక్కల ప్రక్రియ మాత్రమే కాకుండా భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు పునాది అని తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, జనగణన దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక ప్రక్రియ అని అన్నారు. హౌస్ లిస్టింగ్‌లో ఇంటికి సంబంధించిన దాదాపు 30 అంశాలపై వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఇంటి పైకప్పు, ఫ్లోరింగ్, మరుగుదొడ్డి, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, కంప్యూటర్, మొబైల్ ఫోన్ వంటి వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు పూర్తి సహకారం అందించి సరైన సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ర్యాలీలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఉప కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్నరాణి, సమ్మయ్య, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, బల్దియా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, మెప్మా సభ్యులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న సర్పంచ్



**రెబ్బెన, మే13(జనం సాక్షి):** రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ పంచాయతీ లో లబ్ధిదారులు పెరుగు పద్మ-మారుతి దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరులు వెంకటేశం చారి రిబ్బన్ కట్ చేశారు వీరితో పాటు ఉపసర్పంచ్ ఇస్తరి వార్డు మెంబర్ ముంజం పుష్పలత శ్యామ్ మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు వీరు లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ వెంకటేశం చారి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదవారి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. అని అన్నారు ఈ వేడుకలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొని పండుగ వాతావరణంలో గృహప్రవేశాన్ని నిర్వహించారు . పేదలకు అండగా నిలుస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి మరియు సహకరించిన గ్రామ సర్పంచ్, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. లబ్ధిదారుల పేదల సొంతింటి కల నెరవేరుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది.

## బైకుకు బైకు ఢీకొని రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి



**లక్ష్మణ చందా/ నిర్మల్: మే 12 (జనం సాక్షి)** నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన బజారు అనిల్, వయసు 25 రోడ్డు ప్రమాదంలో బైకు బైకు ఢీకొని మృతి చెందినట్లు స్థాని కులు తెలిపారు. స్థానికుల వివరాల ప్రకా రం చిట్యాల సిర్గాపూర్ మధ్య జాతీయ రహ దారిపై గుర్తుతెలియని వాహనదారులు నిర్మల్ నుండి బైంసా వైపు వెళ్లగా, నిర్మల్ వైపు వస్తున్న అనిల్ బైక్ కు బలంగా ఢీకొని మృతి చెందినట్లు తెలిపారు. ఢీ కొట్టిన వాహనదారులు అక్కడి నుండి పరార్ అయినట్టు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య ఉన్నట్లు తెలిపారు.

# ఉపాధి హామీ పని ప్రదేశంలో "క్యాప్చర్" తిప్పలు



**లక్ష్మణ చందా/నిర్మల్: మే 12 (జనం సాక్షి)**ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+ూా) పనుల్లో, ముఖ్యంగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (చీవీమీ) యాప్ ద్వారా కూలీల హాజరును ఐరిస్ (కంటిపాప) లేదా వేలిముద్రల ద్వారా డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడంలో సాంకేతిక సమస్యలు కూలీలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి .ప్రధాన సమస్యలు మరియు తిప్పలు:ఐరిస్/వేలిముద్రలు క్యాప్చర్ కాకపోవడం:లి చాలా మంది కూలీల, ముఖ్యంగా వృద్ధుల మరియు కాయకష్టం చేసే వారి వేలిముద్రలు లేదా కంటిపాపలను యాప్ గుర్తించడం లేదు, దీనివల్లగంటల తరబడి పని ప్రదేశంలోనే వేచి ఉండాల్సి వస్తోంది.సర్వర్ సమస్యలు:లి నెట్‌వర్క్ సరిగా లేకపోవడం లేదా యాప్ సర్వర్ నెమ్మదిగా పనిచేయడం వల్ల ఉదయం 6 గంటలకే పనులకు వచ్చిన కూలీలు, హాజరు నమోదు కోసం పది గంటల వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది.పని కోల్పోవడం:లి యాప్ లో హాజరు పడకపోతే, ఆ రోజు పనిచేసినా వేతనం రాదు. సాంకేతిక సమస్యల వల్ల కూలీలు పని చేసినా, హాజరు లేని కారణంగా ఆ రోజు వేతనం కోల్పోతున్నారు.సమయం వృధా:లి టెక్నికల్ సమస్యల వల్ల కూలీల సమయం వృధా అవ్వడమే కాకుండా, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు పనిచేయడం కష్టంగా మారుతోంది.పర్యవేక్షణ లోపం:లి సాంకేతికత అందుబాటులో లేని ప్రాంతాల్లో లేదా యాప్ సరిగ్గా పనిచేయని సమయంలో కూడా కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు.ఈ సమస్యల వల్ల రాష్ట్రవ్యా ప్తంగా ప్రతిరోజూ వేలాది మంది కూలీలు పనులకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంది, దీనిపై కూలీలు ఆందోళన చెందుతున్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం రోజున 10891 మాస్టారు లు 62,408 మంది కూలీలు పనికి వెళ్లగా మంగళవారం రోజున సాంకేతిక లోపం వల్ల 11302 మాస్టారు లు 66,842 మంది కూలీలు హాజరైనట్టు తెలిపారు. అదేవిధంగా లక్ష్మణ చందా మండల కేంద్రంలో సోమవారం రోజున 595 మాస్టారు లు 3382 మంది కూలీలు హాజరవగా మంగళవారం రోజున సాంకేతిక లోపం వల్ల 575 మాస్టర్ల కు 3374 మంది కూలీలు పనికి వచ్చినట్టు తెలిపారు.కూలీలు ఎవరు ఆందోళన చెందవద్దు డిఆర్డిఓ పిడి విజయలక్ష్మి ఇప్పుడు జరుగుతున్నటువంటి సాంకేతిక లోపాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు లైన్ క్లియర్ చేయడం జరుగుతుంది. పైనుండి సమస్య రావడం వల్ల కొద్దిపాటి లోపం జరుగుతుంది. దానికి అనుగుణంగా కూలీలు ఎవరు ఆందోళన చెందవద్దు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు పైనుండి వెసులుబాటు కల్పిస్తున్నాం. పనికి వచ్చిన వారికి తప్పనిసరిగా హాజరు అయ్యేలా మరియు డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా పనికి వచ్చినవారు సాయంత్రం అర్ధరాత్రి వరకు ఫోటోలు అప్లోడ్ చేయడానికి వెసులుబాటు ఉంటుంది.

# ప్రైవేట్ కార్పొరేట్ టీచర్లపై అడ్మిషన్ టార్గెట్ల వేధింపులు తక్షణమే ఆపాలి

## ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్



**నెరడిగొండ మే13(జనంసాక్షి):**ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బోధనకు బదులుగా అడ్మిషన్లు తెచ్చే పనిలో నెట్టడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయం .ప్రైవేట్ కార్పొరేట్ టీచర్ల పై అడ్మిషన్ల టార్గెట్ వేదింపులు తక్షణమే ఆపాలని ఎఐవైఎఫ్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఇటీవల వెలుగులోకి వచ్చిన సంఘటనల ప్రకారం బుధవారం రోజున ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్లకు అడ్మిషన్ టార్గెట్లు విధించి,అవి పూర్తి చేయకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని, జీతాలుతగ్గి స్తామనియా జమాన్యాలుబెదిరిస్తున్నాయి.ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కానీ,వారిపై ఇలాంటి వాణిజ్య ఒత్తిళ్లు తెచ్చి,బోధనేతర పనులపై దృష్టి మళ్లించడం విద్యా వ్యవస్థను దెబ్బతీస్తోంది. ఈ విధమైన ఒత్తిళ్లు ఉపాధ్యాయు లఆత్మస్థైర్యాన్ని తగ్గించడమే కాకుండా,వారి వృత్తి గౌరవాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి .అడ్మిషన్ల కోసం టీచర్లను మార్కెటింగ్ ప్రతినిధులుగా ఉపయోగించడం పూర్తిగా అనైతికం.విద్యాసంస్థలు లాభాపేక్షతో కాకుండా, విద్యా ప్రమాణాలను పెంపొందించే దిశగా పని చేయాలి.ఉపాధ్యాయులపై ఇలాంటి ఒత్తిళ్లు కొనసాగితే,విద్యా నాణ్యత మరింత దిగజారే ప్రమాదం ఉంది.ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు వెంటనే ఈ వేధింపులను నిలిపివేయాలి.ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులు ఈ విషయాన్ని అత్యంత వేగంగా స్పందించి,ప్రైవేట్ టీచర్ల హక్కులను కాపాడే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులపై అన్యాయమైన టార్గెట్లను నిషేధిస్తూ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి.అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత,కనీస వేతన పిఎఫ్ వంటి హామీ, సముచిత పని పరిస్థితులు కల్పించాల్సిన అవసరం ఉంది.విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడటం ,వారికి ద్వారానే నాణ్యమైన విద్య సాధ్యమవుతుందని ఏఐవై ఎఫ్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిమేస్రం భాస్కర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతాకి స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి




**హనుమకొండ ప్రతినిధి 13 మే (జనం సాక్షి)** :ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులకు ఒకరోజు శిక్షణా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని, గుడిని ఎంత శ్రద్ధగా చూసుకుంటారో బడిని కూడా అంతే బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ బడులు ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చాయని, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు డ్రాప్‌ఔట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు కోసం స్థానిక సంస్థల ప్రతినిధులు, గ్రామ ప్రజలు సమిష్టిగా పనిచేయాలని కోరారు.పాఠశాలల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ప్రత్యేక విద్యా వారోత్సవాల ద్వారా విద్య ప్రాముఖ్యతను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రతి కుటుంబంలో చైతన్యం పెంపొందించాలని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తుకు విద్యనే బలమైన పునాది అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఈఓ గిరిరాజు బాబు, డీడబ్ల్యూఓ విశ్వజ, ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, మండలాల ఎంఈవోలు, గ్రామ సర్పంచులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ విద్యార్థుల భవిష్యత్ పై ప్రభావితం

## ఆర్టీఐ జిల్లా నాయకులు కుమార్ యాదవ్



**మల్హర్,మే 13(జనంసాక్షి)**నిట్ 2026 పేపర్ లికేజీతో దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే విధంగా ఉందని యునైటెడ్ ఫోరమ్ పర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, కోకన్వీనర్ చింతల కుమార్ యాదవ్ అన్నారు.బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు నీట్-2026 పరీక్షలో పేపర్ లీకేజీ ఘటన అత్యంత దారుణమైన సంఘటనని అభిప్రాయం వ్యక్తం చేశారు.రాజస్థాన్‌లోని సికర్ ప్రాంతం నుంచి లీక్ నెట్‌వర్క్ బయటపడిందని, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా ప్రశ్నాపత్రం ప్రచారం జరిగిందని ఆరోపించారు.పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు కష్టపడి చదువుతుంటే డబ్బు, కోచింగ్ మాఫియా, అవినీతి ఆధారంగా కొందరికి ప్రశ్నాపత్రాలు చేరడం ప్రమాదకరమన్నారు.నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.వారి వెంటా జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యుడు వేనాచారి ఉన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ పై విచారణ జరిపించాలి




**చెన్నారావుపేట, మే 13 ( జనం సాక్షి):** నీట్ పేపర్ లీకేజీ పై విచారణ జరిపించి పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్ డీ ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు జన్ను రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏఐఎఫ్ డీఎస్ (అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య) ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ )పరీక్ష పేపర్ నిర్వహించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయం అన్నారు. దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని రాసిన విద్యార్థుల జీవితాలను పేపర్ లీకేజీ చేసి విద్యార్థులకు భవిష్యత్తు లేకుండా వారి యొక్క ఆశలపై కారం చల్లినట్టు చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే సుమారు 71 వేల మంది విద్యార్థులు ఎంతో కష్టపడి భవిష్యత్తుపై ఆశలు పెట్టుకొని నీట్ పరీక్ష రాశారని అలాంటి కీలక పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకోవడం విద్యార్థుల తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. ఈ పేపర్ లీకేజీ బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రంలోనే జరగడం విడ్డూరంగా ఉందని అన్నారు. నీట్ పరీక్ష పెట్టడంలో బిజెపి ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. తక్షణమే నీట్ పరీక్ష నిర్వహణ ఆయా రాష్ట్రాలకే ఇవ్వాలని పేపర్ లీకేజీల పై విచారణ జరిపించి ఎన్ టి ఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ) రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు.

# రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ



**చెన్నారావుపేట, మే 13 ( జనం సాక్షి):** రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ అన్నారు. బుధవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఇందిరా క్రాంతి పథం ( ఐకెపి ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామాలలోని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం తిలక్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, మాజీ అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, చెన్నారావుపేట సర్పంచ్ కంది శ్వేతా కృష్ణ చైతన్య రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకటరెడ్డి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, ఉపసర్పంచ్ దొంతి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, జున్నుతుల మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, సీసీలు కట్టయ్య, మంజుల, మాణిక్యం, ఆశాజ్యోతి మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి గంగిడి కవిత, వివో అధ్యక్షులు అర్చన, వివో ఏలు సుధ, కోమల, ఆమని, మంజుల, మండల సమైక్య సిబ్బంది రజిత, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

# మౌళిక వసతులపై దృష్టి సారించాలి

## డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్



**వరంగల్ ఈస్ట్, మే 13 (జనం సాక్షి)**ప్రభుత్వ జూ. కళాశాల ఖిలా వరంగల్ భవన, మౌళిక వసతులపై దృష్టి సారించాలని డీఐఈఓ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ అన్నారు. బుధవారం నాడు కళాశాలలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక- విద్య వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ప్రత్యేక కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ గత సం. నుండి కళాశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని అందులో భాగంగా భవన నిర్మాణానికి భూ కేటాయింపు, ఎంపీసీ బైపీసీ కోర్సుల ప్రారంభం, మధ్యాహ్న భోజనం తదితర అంశాలు కళాశాల పురోగతికి తోడ్పడుతున్నాయని అన్నారు. కళాశాలలో విద్యార్థుల అవసరాల మేరకు అదనపు తరగతుల/షెడ్ల నిర్మాణం మరియు శాశ్వత భవన ప్రతిపాదనలపై దృష్టి సారించాలని అన్నారు. విద్యార్థులకు తగు సదుపాయాలు కల్పిస్తే భవిష్యత్తులో అడ్మీషన్లు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పుష్పలత, అడ్వకేట్ జీవన్ , అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మెన్ , కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే 4, జనంసాక్షి**ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో ఒక భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు తాడిచర్ల ప్రభుత్వ కళాశాలలో చేరాలి

## సర్పంచ్ బండి స్వామి

**మల్హార్, మే 13(జనంసాక్షి)** మండల కేంద్రంలోని తాడిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత రెండు రోజులుగా ప్రారంభమైన తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు తాడిచెర్ల జూనియర్ కళాశాల అధ్యాపకులతో కలిసి స్థానిక సర్పంచ్ బండి స్వామి ఈ సంవత్సరం పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఎవరు కూడా డ్రాప్ అవుట్ కాకుండా స్థానిక కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలని కోరారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అమ్మాయిలను తప్పకుండా పై చదువులు చదివించాలని చదువు మానేయకుండా చూడాలని కోరారు. ఈ సంవత్సరం తాడిచర్ల జూనియర్ కళాశాల ఇంటర్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం పొందినందుకుగాను కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి, అధ్యాపకులను అభినందించారు. పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు,అధ్యాపకులు, విద్యార్థులు,పాల్గొన్నారు.

# విద్య, నైపుణ్యత పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తాం

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల ప్రతినిధి, మే13, జనంసాక్షి**విద్య, నైపుణ్యత పట్టుదల ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదల ఉన్న వారిని ప్రోత్సహిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో టామ్ కామ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ కుమార్, టామ్ కామ్ సంస్థ మేనేజర్ అనిల్ కుమార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ సరైన విద్య, నైపుణ్యత కలిగిన వారికి విదేశాలలో మంచి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సరైన అర్హత కలిగిన వారికి ఆయా దేశాల భాష నేర్పించి ఉపాధి కల్పించడంలో టామ్ కామ్ సంస్థ మంచి పని చేస్తుందని తెలిపారు. జర్మనీ, జపాన్, ఇజ్రాయిల్ దేశాలతో పాటు గ్రీస్, యూరోప్ వంటి దేశాలలో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యత, అనుభవం కలిగిన వారి కొరకు ఆయా దేశాలు సంప్రదిస్తున్నాయని తెలిపారు. అర్హత, నైపుణ్యత గల వారికి ఆయా దేశాలలో వారానికి 35 గంటల పని ఉంటుందని, దాదాపు 2 లక్షల రూపాయల వరకు వేతనం వస్తుందని తెలిపారు. ఈ క్రమంలో యువతకు ఉపాధి కల్పించడంలో మందమర్రి ప్రాంతంలో శిక్షణ కేంద్రం ప్రారంభించడం సంతోషంగా ఉందని, జూన్ 10వ తేదీ నుండి ఉదయం 4 గంటలు, సాయంత్రం 4 గంటలు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నర్సింగ్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్ వంటి అనేక రంగాలలో నైపుణ్యత గల అభ్యర్థుల కోసం అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం టామ్ కామ్ సంస్థకు 90 కోట్ల రూపాయలు అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మందమర్రి నుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, తరువాత బ్యాచ్ కు ఆదర్శంగా మారాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు వెళ్లాలని, చిత్తశుద్ధితో పనిచేసి డబ్బులు సంపాదించుకోవాలని, మనతో పాటు మరింత మందికి అభివృద్ధి చెందే అవకాశం కల్పించి చేయూత అందించాలని తెలిపారు. మనం కష్టపడి సంపాదించి ఖర్చు పెడితే గౌరవం ఉంటుందని, మన కుటుంబాన్ని సక్రమంగా చూసుకోవచ్చని తెలిపారు. పారిశ్రామిక శిక్షణా సంస్థ, సింగరేణి సంస్థల ద్వారా అనేక మంది శిక్షణ పొంది, అప్రెంటిస్ పూర్తి చేసి అనుభవం పొందుతున్నారని, ఏకాగ్రతతో విదేశీ భాషను నేర్చుకొని విదేశాలలో పనిచేసే అవకాశం సంపాదించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విదేశాలలో ఉద్యోగ భద్రతతో కూడిన ఉపాధి కల్పించడం జరుగుతుందని, ఆయా దేశాలలో సాంఘిక భద్రత, కార్మిక చట్టాల ద్వారా కార్మికులకు సంతృప్తికరమైన ఉపాధి లభిస్తుందని తెలిపారు. వారానికి 35 గంటల పని ఉంటుందని, నిబంధనల ప్రకారం నైపుణ్యత, అనుభవం ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆయా దేశాలకు సంబంధించి అర్హత గల అభ్యర్థులు ఆ దేశాల భాష నేర్చుకోవాలని, సాంకేతిక నైపుణ్యత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పొందేందుకు వేరే ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానిక యువతకు మందమర్రి మండలంలో అందుబాటులో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘనపూర్ విద్యారంగంలో ఆదర్శంగా నిలవాలి



## వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

**స్టేషన్ ఘన్పూర్, మే 13 ( జనం సాక్షి) :**స్టేషన్ ఘనపూర్ విద్యారంగంలో ఆదర్శంగా నిలవాలని, ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా స్టేషన్ ఘనపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గ్రామ సర్పం చులు, కౌన్సిలర్లు విద్యా అవగాహన సదస్సుకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం సమాజం చేతుల్లోనే ఉందని, ప్రజాప్రతినిధులు గుడిని ఎంతశ్రద్ధగా చూసుకుంటారో బడిని కూడా అంతే బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎన్నో ఉన్నత స్థానా లకు చేరుకున్న వారిలో ప్రస్తుతం సర్పంచులు, కౌన్సిలర్లు కూడా ఉన్నారని గుర్తుచేశారు. ప్రభుత్వ బడులు మట్టిలోమాణిక్యాలను తీర్చిదిద్దుతున్నా యని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధి స్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు కూడా వస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 550కుపైగా మార్కులు సాధించిన 120 మంది విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ముఖ్యంగా పేద విద్యార్థుల ను గుర్తించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సర్పంచులు, కౌన్సిలర్లు ముందుండాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన వసతులు కల్పించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపుని చ్చారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెంచి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు, ప్రజాప్రతి నిధులుప్రత్యేకంగా కృషిచేయాలని సూచించారు. బడి సమాజాన్ని తయారు చేస్తుందని, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతుందని పేర్కొన్న ఎంపీ, ఉపాధ్యాయులు పిల్లలను సొంత పిల్లల్లా చూసు కుంటూ వారి ప్రతిభను గుర్తించి అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచిం చారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై నిరంతర మానిటరింగ్ నిర్వహిం చాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు నెలకు ఒకసారి లేదా రెండు నెలలకు ఒకసారి పాఠశాలలను సందర్శిం చి విద్యార్థులను పలకరించాలని, వారి సమస్య లు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత 11వేల మంది ఉపాధ్యాయులను భర్తీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్, వ్యవసాయ మార్కె ట్ కమిటీ ఛైర్మన్ జూలుకుంట్ల లావణ్య రెడ్డి, నియో జకవర్గ ఎంఈఓ లు, కౌన్సిలర్లు, సర్పంచు లు, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి

- ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- భూపాలపల్లిలో విద్యాశాఖపై వర్క్ షాప్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక విద్యా వారోత్సవాల రోజు వారి కార్యాచరణ కార్యక్రమాలపై మండల విద్యాశాఖ అధికారులు, సర్పంచ్ లతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాల ఒక దేవాలయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ మీద పటిష్టమైన ఆలోచనతో ముందుకు వెళుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగాలన్న లక్ష్యంతో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో ఒక ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేసి సెమి రెసిడెన్షియల్ పాఠశాలగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి వసతి గృహాల్లోని విద్యార్థులకు 200 శాతం కాస్మెటిక్ చార్జీలు, 40 శాతం డైట్ చార్జీలు పెంచినట్లు గుర్తు చేశారు. సర్పంచులు తమ తమ పరిధిలో గల పాఠశాలలను తనిఖీ చేసి విద్యాబోధన, మెనూ అమలును పరిశీలించాలని సూచించారు. భవిష్యత్ తరాలను మంచి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్పష్టం తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆయన చెప్పారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ వ్యవస్థ చాలా పటిష్టమైనదని, అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. పాఠశాలల్లో క్రీడా స్థలాలు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి ప్రతిపాదన లు అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు పఠనాశక్తిని పెంపొందించడమే కాకుండా ఉద్యోగాల సాధనకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ క్రమంలో ఎక్కడైనా తప్పులు జరిగితే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలల మీద నుండి విద్యుత్ లైన్లు వెళ్తుంటే అట్టి జాబితాను అందజేయాలని వాటిని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ విద్యార్థుల కొరకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చు భవిష్యత్తుకు పెట్టుబడి అన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి రోజు చేయాల్సిన కార్యక్రమాలను నిర్దేశించినట్లు తెలిపారు. విద్య మీద సర్పంచులు ఫోకస్ పెట్టి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టి పాఠశాలలను సుందరీకరణ చేసినట్లు తెలిపారు. జిల్లాలో యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ఈ సంవత్సరం 10వ తరగతి, ఇంటర్ లో మంచి ఫలితాలు సాధించామని, విద్యార్థులను, ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. విద్యార్థులు బాగా చదివి మన జిల్లాకు, రాష్ట్రానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. విద్యా వైద్యంపై ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెడుతున్నట్లు ఆయన సూచించారు.ప్రతి పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్ఓ వసంతకుమారి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఆయా మండలాల ఎంఈఓలు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబం సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోవాలి



## జిల్లా మేనేజర్ టిజి రెడ్కో గంధం రాజేందర్

**గూడూరు,మే12(జనంసాక్షి):**ప్రతి కుటుంబం తమ ఇండ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్ ను ఏర్పాటు చేసుకొని, సూర్య శక్తిని,విద్యుత్ శక్తిగా మార్పిడి చేసుకొని స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని జిల్లా మేనేజర్ టిజి రెడ్కో గంధం రాజేందర్ తెలిపారు. బుధవారం గూడూరు గూడూరు గ్రామపంచాయతీలో పీఎం సూర్యగర్ -పీఎం కుసుమ్ పథకాలపై సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అధ్యక్ష తన సమావేశం జరిగినది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా మేనేజర్ టీజీ రెడ్కో గందం రాజేందర్ హాజరైనారు.అనంతరం గంధం రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం సూర్యగర్ యోజన కింద 1 కిలోవాట్‌కు రూ.30,000,2 కిలోవాట్లకు రూ.60,000,3 కిలోవాట్లకు రూ.70,000 వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు అయన తెలిపారు.సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ మాట్లాడుతూ...సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించవచ్చని పేర్కొన్నారు.అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి ఆదాయం పొందే అవకాశమూ ఉందన్నారు.సోలార్ ప్యానెల్స్ ద్వారా సుమారు 25 సంవత్సరాల పాటు ఉచిత విద్యుత్ లభిస్తుందని,ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.అలాగే పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయ భూముల్లో సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చని తెలిపారు.ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు 3.5 నుంచి 4 ఎకరాల భూమి అవసరమవుతుందని,ఆ భూమి సమీప సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉండాలని,ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటు వ్యయం సుమారు రూ.3.5 కోట్ల వరకు ఉంటుందని వివరించారు .రాష్ట్ర ప్రభుత్వం ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటోందని, రుణ సదుపాయాలు కూడా కల్పించబడనున్నాయని తెలిపారు.ఈ పథకం ద్వారా రైతులు సంవత్సరానికి సుమారు రూ.50 లక్షల నుంచి రూ.52 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. పీఎం కుసుమ్ రెండో విడత మార్గదర్శకాలు విడుదలైన వెంటనే రైతులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ 'ముద్దసాని' విగ్రహ ఆవిష్కరణ



**చెన్నారావుపేట, మే 13 ( జనం సాక్షి):** చెన్నారావుపేట సొసైటీ మాజీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. బుధవారం ముద్దసాని సత్యనారాయణ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా తన తండ్రి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు ముద్దసాని రాహుల్ రెడ్డి- సుచిత దంపతులు తన స్వగ్రామమైన ముదిగొండలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ చింతకింది వంశీ సొసైటీ పాలకవర్గ సభ్యులు, సిబ్బందితో కలిసి ముద్దసాని సత్యనారాయణ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి చెన్నారావుపేట సొసైటికి అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ముద్దసాని సత్యనారాయణ రెడ్డి సతీమణి ముద్దసాని శారద, కూతురు అల్లుడు గార్లపాటి గీత శరత్ చంద్రారెడ్డి, మనమరాలు గార్లపాటి అనైర, సొసైటీ డైరెక్టర్ లు మజ్జిగ రాంబాబు, జున్నుతుల రమాదేవి మహేందర్ రెడ్డి, సొసైటీ సీఈఓ చిట్టె రవి, సొసైటీ సిబ్బంది మాసాడి రమేష్, కొలగాని రాఘవులు, మహమ్మద్ సలీం, గొట్టె ప్రవీణ్, జాటోత్ రాజ్ కుమార్, జంగిలి ప్రదీప్, పిల్లల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి భూమిపూజ

**మల్హర్, మే 13 (జనంసాక్షి)**మండల పరిధిలోని గాదంపల్లి గ్రామములో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి బుధవారం సర్పంచ్ బండారి నర్సింగం భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎం పిపి మాలహల్ రావు హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పిల్లలు, గర్భిణీలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండారి నర్సింగం,మాజీ ఎంపీపీ మలహర్ రావు, జిల్లా యూత్ నాయకులు మండల రాహుల్, ఉప సర్పంచ్ తాళ్ళ రవీందర్, వార్డు సభ్యులు తాటికొండ కేశవ చారీ, పంచాయతీ కార్యదర్శి పెంచాల సతీష్, బియ్యాన్ని కుమార్, రాఘవ చారీ, సలీం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారాలపై నిర్లక్ష్యం వహించవద్దు

## మార్నింగ్ వాక్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ అధికారులకు సూచన



**నిర్మల్ మే 13 జనం సాక్షి:**పట్టణంలోని 36వ వార్డు కాలనీలో పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించడానికి మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి అధికారులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డ్రైనేజీ సమస్యలు, ఇంటి అవసరానికి ఉపయోగించే నీటీ బావులు, వీధి దీపాల పనితీరుపై స్థానికులవద్ద ఆరా తీసారు. మౌలిక సదుపాయాల్లో ఉన్న సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు సూచించారు. స్థానికులతో మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు తమ ప్రాంత సమస్యలను వైస్ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 36వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బండి లావణ్య ను మున్సిపల్ వైస్ చైర్మన్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,నాయకులు పాల్గొన్నారు.

# షూటింగ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు రాజవరం విద్యార్థి ఏంపిక

**స్టేషన్ ఘన్పూర్, మే 13 ( జనం సాక్షి ) :**మార్చ్ నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో చిల్పూర్ మండలంలోని రాజవరం ఉన్నత పాఠ శాల విద్యార్థి సంగి రూత్విక్ ప్రతిభ కనబరచి ఈ నెల 12.13.14 తేదిలలో జరుగు మహబూబా బాద్ జిల్లాలోని ఎన్ టి ఆర్ స్టేడియం లో జరిగే షూటింగ్ బాల్ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీలకు ఏంపికైనట్లు జనగామ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ తెలిపారు. జనగామజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇనుగాల యుగేందర్ రెడ్డి,స్కూల్ హెచ్ఎం, ఎంఈఓ గోవర్ధన్, రాజవరం సర్పంచ్ మోటం రాజు , ఉపాధ్యాయ బృందం రుత్విక్ ను అభినందించారు.

# ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలల్లో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి



**ములుగు ప్రతినిధి,లమే 13(జనంసాక్షి).** జిల్లాలో మే 20 నుంచి 22 వరకు నిర్వహించే ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలలో పాల్గొనేందుకు జిల్లా ప్రజలు, కళాకారులు, క్రీడాకారులు, విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, ఉత్సవాలపై ప్రజలకు తెలియజేసేలా విస్తృత ప్రచారం కల్పించాలని, సోషల్ మీడియా, ఇతర ఛానెళ్ల ద్వారా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడల విభాగం లో వాలీబాల్, చెస్, క్యారమ్స్ , సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో రంగోళి పోటీ, ఫుడ్ స్టాళ్లు, మెహందీ పోటీ, హెయిర్ స్టైల్ పోటీ, టగ్ ఆఫ్ వార్, గిరిజన నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనం లలో పాల్గొనే వారు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, అదే విధంగా ములుగు అభివృద్ధి,ప్లాస్టిక్ రహిత ములుగు,డ్రగ్స్ రహిత ములుగు అనే మూడు అంశాలపై రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ విభాగం లో ఒక టీమ్‌కు 3 మంది చొప్పున, ప్రతి అంశంపై 5 టీమ్‌ల వరకు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రజలు, మహిళలు, కళాకారులు, విద్యార్థులు, క్రీడాకారులు మే 13 నుంచి మే 18, 2026 వరకు ఈడి ఎస్సీ కార్పొరేషన్ అధికారి ధర్మ నాయక్ సెల్ నంబర్ 7032153610 లేదా డివైస్ఓ రామ్మోహన్ 7207503775 కు ఆన్‌లైన్ విధానం లో వాట్సాప్ ద్వారా తమ వివరాలు పంపించాలని, ఆఫ్‌లైన్ విధానంలో ఈడి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం లేదా జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం లో ఈనెల 18వ తేది సాయంత్రం 5 గంటలలోపు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**మల్హర్, మే13(జనంసాక్షి)** బుధవారం మాలహర్ రావు మండలం లోని కొయ్యూరు, కొండంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాప్యం లేకుండా దాన్యం కొనుగోలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల వద్ద తార్ఫాలిన్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. రవాణా సమస్య ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. రోజుకు రెండు లారీలు కొనుగోలు కేంద్రాలకు పంపాలని ఆదేశించారు. కచ్చితమైన రిజిస్టర్లు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని శుభ్రపరచాలని తాలు, రాళ్లు ,మట్టి గుల్లలు లేని నాణ్యమైన ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు రైతులు సహకరించాలన్నారు. ప్యాడి క్లీనింగ్ పరికరాలు అందుబాటులో లేకపోతే మరొక చోట నుంచి తెప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ కె రవి కుమార్, ఫాక్స్ చైర్మన్ ఇప్ప మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

**చెన్నారావుపేట, మే 13 ( జనం సాక్షి):** సీనియర్ జర్నలిస్ట్ పిట్టల కుమారస్వామి తల్లి విజయ సంవత్సరీకానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై ఆశీర్వదించారు. చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు పిట్టల కుమారస్వామి తల్లి విజయ సంవత్సరికం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై విజయ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమంలో చెన్నారావుపేట గ్రామ పార్టీ అధ్యక్షులు కందకట్ల నాయకులు గట్ల కృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# తాలు పేరుతో దోపిడి చేస్తే సహించేది లేదు

- రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు
- అధికారులకు ఎమ్మెల్యే సత్తన్న స్ట్రాంగ్ వార్నింగ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తాలు పేరుతో దోపిడి చేస్తే సహించేది లేదని, రైతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయొద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు, మిల్లర్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో వడ్లు, మక్కల కొనుగోళ్లపై రెవిన్యూ, పౌరసరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్ రవాణా, డిఆర్డిఓ, సహకార, పంచాయతీరాజ్, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు ట్రక్ షీట్ ఇవ్వకపోవడం పట్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నెల రోజులు వడ్లు, మక్కల కొనుగోళ్లు అత్యంత ప్రతిష్టాత్మమని ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుందని తెలిపారు. సమావేశాల్లో మాట్లాడుకున్నది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా వేసిన తదుపరి రైతుకి ఏమి సంబంధమని, ట్రక్ షీట్ జారీ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, దాని వల్ల రైతుల ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వైఫల్యానికి ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. తాలు పేరుతో అబద్ధాలు ఆడొద్దని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులతో వరి కోత యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. తాలు, తరుగు తీయొద్దని, మిల్లర్లకు పలుమార్లు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం, కానీ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తే ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన తదుపరి కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, మిల్లర్లదే బాధ్యతని కాంటా అయ్యేంత వరకు మాత్రమే రైతు బాధ్యతని తెలిపారు. అకాల వర్షాలకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులను ఎందుకు ఇబ్బందులు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది రైతు చేసిన పాపమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాము, రవాణా, కాంటా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రవాణాలో ఇబ్బందులు కల్పిస్తే ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రవాణాలో ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు. రైతులకు 48 గంటల్లో నగదు జమ చేసేందుకు కొనుగోలు జరిగిన వెంటనే ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని తెలిపారు. రైస్ మిల్లుల వద్ద దాన్యం దిగుమతి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, డిఆర్డిఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియా నాయక్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే దోపిడి విముక్తికి మార్గం




**నర్సంపేట మే 13 (జనం సాక్షి)** దేశంలో పెరిగిపోతున్న దోపిడీ అసమానతలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని ఎం సి పి ఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ పోలిట్ బ్యూరో సభ్యులు కుల్దీప్ సింగ్ అన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎం సి పి ఐ (యు) వ్యవస్థాపకులు, అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా నర్సంపేటలోని నెక్కొండ రోడ్డు సర్కిల్ నుంచి సిటిజన్ క్లబ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీ ముందు కోలాటాలు డప్పు బృందం కళాకారుల ఆటపాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్. అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భ ంగా అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ . చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మద్ది కాయల అశోక్ ఓంకార్, కుల్దీప్ సింగ్ మాట్లాడుతూ దేశంలో మోడీ అనుసరిస్తున్న విధానాలు ప్రజలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని ఈ క్రమంలో మత వైరుధ్యాలు నియంతృత్వాన్ని పెంచి పోషిస్తున్నారని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు సామాజిక శక్తులు ఐక్యంగా ఉద్యమిస్తే తప్ప ప్రత్యామ్నాయం లేదన్నారు. ఆ దిశలో వర్గ సామాజిక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అరుణోదయ విమలక్క, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్ యు సి ఐ రాష్ట్ర నాయకులు గంగాధర్ లు మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ పీడిత ప్రజల పక్షాన పోరాడిన యోధుడని చట్టసభలకు వన్నె తెచ్చాడని రాజకీయ విలువలకు ఆదర్శాలకు త్యాగాలకు నిలువుటద్దంగా నిలిచాడని ఆయన కోరుకున్నట్లు లాల్ నీల్ ఐక్యతను పెంపొందించాలని ఆయన ఆశయ సాధనలో అంతరాలు లేని సమాజ స్థాపనకు చేయాలని పిలుపునిచ్చారు. ఎం సి పి ఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి. మాట్లాడుతూ ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను పాఠ్యాంశంలో చేర్చి వారి గుర్తుగా స్మారక చిహ్నాలు మ్యూజియం ఏర్పాటు చేయాలని, కామ్రేడ్ ఓంకార్ పేరుతో నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి, స్టేడియంకు నర్సంపేట నుంచి వరంగల్ ప్రధాన రహదారికి నామకరణం చేయాలని, హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై కాంస్య విగ్రహాలు పెట్టించాలని విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి. వనం సుధాకర్. కుంభం సుకన్య. గోనె కుమారస్వామి. వస్కుల మట్టయ్య. వరికుప్పల వెంకన్న. ఎన్ రెడ్డి హంసరెడ్డి కన్నం వెంకన్న మంద రవి. ఎస్.కె నజీర్. తుకారాం నాయక్ .గేయ రచయిత యోచన రాష్ట్ర కమిటీ సభ్యులు వంగల రాగసుధ. కుసుంబా బాబురావు .నర్ర ప్రతాప్. కనకం సంధ్య. గుండెబోయిన చంద్రయ్య. మైదం శెట్టి రమేష్ .తుడుం అనిల్ కుమార్. కంచ వెంకన్న .మాలోతు జబ్బర్ నాయక్ కర్రోళ్ల శ్రీనివాస్ తాండ్ర కళావతి నీల రవీందర్ కర్ర రాజిరెడ్డి గడ్డం నాగార్జున పల్లె మురళి మాస్ సావిత్రి మహమ్మద్ రాజా సాహెబ్ మాలోతు సాగర్ కొత్తకొండ రాజమౌళి. మాలి బాబురావు. ముక్కెర రామస్వామి కేశెట్టి సదానందం సింగతి మల్లికార్జున్ జన్ను రమేష్ వందలాదిమంది కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ

• బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ



శాయంపేట, మే 13 (జనం సాక్షి)దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పరీక్షా పత్రం లీకేజీ వ్యవహారంపై బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకత్వం నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆరోపించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు మేరకు శాయంపేట మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ మాట్లాడుతూ, పగలు రాత్రి కష్టపడి చదివిన సుమారు 23 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వంచెలగాటమాడుతోందని మండిపడ్డారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన జాతీయ అర్హత పరీక్షను కూడా పకడ్బందీగా నిర్వహించలేని స్థితిలో కేంద్రం ఉందని,ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. పరీక్షకు ముందు రోజే వందకు పైగా ప్రశ్నలు లీక్ అయ్యాయంటే, విద్యా వ్యవస్థలో లోపాలు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో 2024లో జరిగిన నీట్ లీకేజీ ఉదంతం నుండి కేంద్రం ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని, ఆ నిర్లక్ష్య వైఖరి వల్లే నేడు మళ్ళీ ఇలాంటి ఘటన పునరావృతమైందని గుర్తు చేశారు. వరుసగా వెలుగుచూస్తున్న ఈ అసమర్థత విద్యార్థులకు శాపంగా మారిందని, కేంద్ర సర్కారు తీరు వల్ల అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని ధ్వజమెత్తారు. వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో విఫలమైన ఎన్డీయే ప్రభుత్వం ఈ బాధ్యతను స్వీకరించాలని డిమాండ్ చేశారు.ప్రశ్నాపత్రం లీకేజీ వెనుక ఎంతటి పెద్దవారు ఉన్నా సరే, వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని కొమ్ముల శివ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించి, వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాలని కోరారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత త్వరగా అత్యంత పకడ్బందీగా మళ్లీ నీట్ పరీక్షను నిర్వహించాలని, ఈ వైఫల్యానికి గాను కేంద్రం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఆరెకిల్ల ప్రసాద్, మండల నాయకులు రంగు మహేందర్, కుతాటి రమేష్, బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు అరికెళ్ల వెంకట్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## మక్కల కొనుగోలు కేంద్రాలలో కళ్ళు మూసుకుపోయిన సొసైటీ అధికారులు



నెక్కొండ, మే 13 (జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రాల్లోని మక్కల కనుగొను కేంద్రాలలో మక్కా రైతులు పడుతున్న అవస్థలు బాధలు సొసైటీ అధికారుల కనబడటం లేదని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, కొనుగోలు కేంద్రాలలో రైతే అన్ని తానే చేసుకుంటే హమాలీలు ఎందుకు సొసైటీ అధికారులు ఎందుకు అని రైతుల బాధను వ్యక్తం చేస్తున్నారు, మక్కలు పండించిన పాపానికి రైతే అన్ని తానే భరిస్తున్న సొసైటీ అధికారులు గానీ హమాలీ వ్యవస్థ గాని రైతులకు సహాయ సహకారాలు అందికపోవడమే కాకుండా రైతులకు అన్ని విధాల ఇబ్బంది పెడుతున్నారే వాపోతున్నారు, సొసైటీ అధికారులు మక్కల బస్తాలను తరలించడంలో అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. రైతులే ట్రాక్టర్ల ద్వారా డీసీఎం ల సాయంతో గోదాములకు తరలిస్తున్నారు, సొసైటీలో సిబ్బందిలా తీరు ఎవరికి వారే యమునా తీరే అనే రీతిలో ఉందని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, వానకాలం ఎదురుచూస్తున్న రైతులకు మక్కాల్లో అమ్మక పోవడం కాకుండా తరలింపుల్లో జాపం జరుగుతుందని సవ్యంగా సాగే విధంగా చూడాలని రైతులు పై అధికారులు కోరుతున్నారు.

## విద్యారంగ అభివృద్ధిలో సర్పంచులదే కీలక పాత్ర

• జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్ బ్యూరో, మే 13(జనం సాక్షి):బుధవారం ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జెడ్ పి హెచ్ ఎస్ కురవి పాఠశాల యందు నిర్వహించిన కురవి మండలం మరియు సిరోలు మండల సర్పంచుల ఒకరోజు ప్రత్యేక శిక్షణ (ఓరియెంటేషన్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి---ప్రత్యేకించి విద్యారంగ అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గ్రామ పాఠశాల బలోపేతమే గ్రామాభివృద్ధికి పునాది" అని స్పష్టం చేశారు. విద్యను ప్రజా ఉద్యమంగా మార్చాలని ప్రతి గ్రామంలో పాఠశాలల అభివృద్ధి పనులకు సర్పంచులు ముందుండాలని అన్నారు. విద్యార్థుల హాజరు, శుభ్రత, భద్రత, త్రాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులపై గ్రామ పంచాయతీలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. డ్రాప్‌అవుట్స్‌ను పూర్తిగా నిర్మూలించడం సర్పంచుల తక్షణ లక్ష్యం కావాలని అన్నారు. గ్రామం కలిసి ముందుకు తీసుకెళ్లే సమిష్టి బాధ్యతగా పేర్కొన్నారు. తల్లిదండ్రులను పాఠశాల కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇటీవలి పాఠశాల సందర్శనల్లో చూసిన మంచి పద్ధతులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆల్వాల సత్యనారాయణమూర్తి మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ నాయక్, ఇస్లావత్ లచ్చిరాం నాయక్, ఏ సి జి ఈ మందుల శ్రీరాములు. ఎఫ్ ఏ ఓ బానోత్ శంకర్ నాయక్, సీఎంఓ వంగ సురేష్ ఏ ఎస్ సి సంతోష్ ఎంపీడీవో,లు వీరబాబు మరియు మహమ్మద్ గౌస్ పాషా స్థానిక ప్రధానోపాధ్యాయులు ఎండి వహీద్.ఆర్పీలు ప్రవీణ్ శివప్రసాద్ లింగమూర్తి ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాలలో సర్పంచులకు అవగాహన సదస్సు



గూడూరు,మే12(జనంసాక్షి): పాఠశాలలు సమాజానికి బలమైన పునాది వేస్తుందని మండల విద్యా శాఖ అధికారి ఆడెపు సుజాత అన్నారు. బుధవారం గూడూరు మండలంలో వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులకు అవగాహనా సదస్సును బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆడెపు సుజాత జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు.ఇట్టి కార్యక్రమంలో వివిధ గ్రామ పంచాయితీలకు చెందిన 19 మంది సర్పంచులు అవగాహన సదస్సుకు హాజరైనారు.ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి సుజాత మాట్లాడుతూ పాఠశాలలు సమాజానికి బలమైన పునాది వేస్తుందని, గ్రామపంచాయతీ పరిధిలో విద్యావంతుల కుటుంబాలు ఉంటే ఆరోగ్యకరమైన సమాజాన్ని మరియు భవిష్యత్తు మెరుగు సమాజాన్ని అందించవచ్చునని అన్నారు. మన తెలంగాణ ప్రభుత్వం 2026 – 27 విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రతి విద్యార్థికి కిట్స్ (22 రకాల నాణ్యమైన వస్తువులు),నాణ్యమైన బోధన మెరుగైన మౌలిక సదుపాయాలు,డిజిటల్ లెర్నింగ్ ద్వారా పాఠశాలను బలోపేతం చేస్తుందని కొనియాడారు.రిసోర్స్ పర్సన్స్ స్థానిక సర్పంచులకు 10 అంశాలపై పూర్తిగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సత్యనారాయణ,షాహిద్ అలీ,ధర్మా నాయక్,చందా నాయక్, ఉపాధ్యాయులు ,రిసోర్స్ పర్సన్స్ గా మల్లేశం, మనోహర,ఆదినారాయణ, శ్రీనివాస,రవిచంద్ర తో పాటు ఎమ్మార్సీ సిబ్బంది సుధాకర్, రవికుమార్,సంపత్,నరేష్, జితేందర్, సరిత పాల్గొన్నారు.

## జీఎం కార్యాలయంలో ప్రయాస్ కో ఆర్డినేషన్ సమావేశం



శ్రీరాంపూర్( జనంసాక్షి): సింగరేణి అధికారులు, సీఎంపీఎఫ్ అధికారులు సంయుక్తంగా బుధవారం శ్రీరాంపూర్ ఏరి యా జీఎం కార్యలయంలో ప్రయాస్ కో ఆర్డినేషన్ సమా వేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ భరత్ కుమార్ మాట్లాడుతూ ఈపీఎఫ్ కన్నా సీఎంపీఎఫ్ ఎంతో బెటర్ అని ఉద్యోగులు పీఎఫ్ డబ్బులు చిన్న చిన్న కారణాలకు ఉపసంహరించుకొని దుర్వినియోగం చేసుకోకుండా వాటిని కాపాడుకుంటే దురదృష్టవ శాత్తు వారికి ఏమైనా జరిగినా ఆ డబ్బులు వారి డిపెండెంట్లకు ఎంతగానో ఉపయోగపడు తాయన్నారు .ఉద్యోగులకు,పెన్షనర్లకు ఎలాంటి జాప్యం లేకుండా పీఎఫ్,పెన్షన్ సెటిల్మెంట్లు పూర్తిచేస్తామన్నారు.జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారం ఎంతో క్లిష్టంగా ఉండేదని,వారిని సంప్రదించటం సైతం ఎంతో కష్టంగా ఉండేదని,కానీ ఇప్పుడు సీఎంపీఎఫ్ అధికారులే నేరుగా మన వద్దకు రావటం చాలా శుభపరిణామం అన్నారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన భరత్ కుమార్ మైనింగ్ ఫీల్డ్ నుంచి రావటం ఆహ్వానించదగ్గ పరిణామని,వారికి నేరుగా సింగరేణి ఉద్యోగుల సమస్యలు తెలుసుకునుక పీఎఫ్,పెన్షన్ సెటిల్మెంట్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్2 గోవర్ధన్,గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీ సైదా,డీజీఎం అనిల్ కుమార్,సీనియర్ పీఓ సురేందర్, జీఎం చర్చల ప్రతినిధి బద్రి బుచ్చయ్య,జీఎం కార్యలయం గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి సందీప్,అన్ని గనుల సంక్షేమ అధికారులు,సిబ్బంది, సీఎంపీఎఫ్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సేవే తన లక్ష్యం అంటున్న సర్పంచ్

బచ్చన్నపేట మే 13 ( జనం సాక్షి): బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన సర్పంచ్ కోడూరు స్వర్ణలత శివకు మార్ గౌడ్ ప్రతిరోజు అనునిత్యం గ్రామ సేవలో నిమగ్నమై ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని వారికి కావలసినప్పుడు అందుబాటులో ఉండి గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాడని గ్రామస్తులు సర్పంచ్ ని కొనియాడారు. గ్రామంలోని మురికి కాలువలు వీధులు శుభ్రం చేయ డంలో రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ సిబ్బందితో మురికి కాల్వలను వీధులను శుభ్రం చేయించడం వీధిలైట్లను అమర్చడం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాడని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవ చేయడం అభినందనీయమని కొనియాడారు



## సరస్వతి అంత్య పుష్కరాలకు మంత్రులకు ఆహ్వానం



కాళేశ్వరం , మే 14 , ( జనం సాక్షి). జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం లో మే 21 నుండి జూన్ 1 వరకు జరిగే సరస్వతి నది అంత్య పుష్కరాల ఆహ్వాన పత్రికను మంత్రులు కొండా సురేఖ కు , కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి మరియు ఉత్తంకుమార్ రెడ్డి కి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కి దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మరియు దేవాదాయ శాఖ కమీషనర్ ఎం. హను మంతరావు అందజేశారు .ఈ కార్యక్రమంలో ఆర్ జె సి రామకృష్ణ రావు , కాళేశ్వరం దేవస్థాన చైర్మన్ మోహన్ శర్మ, ఆలయ ఈ ఓ మహేష్ ఉప ప్రధాన అర్చకులు ఫణీంద్ర శర్మ పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్



**నస్పూర్(జనంసాక్షి):** పాలిసెట్ ఎంట్రెన్స్ టెస్ట్‌మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు మంచిర్యాల జిల్లా పాలిసెట్ కో ఆర్డినేటర్,సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2364 మంది విద్యార్థులకు గాను 2206 మంది ప్రవేశ పరీక్షకు హాజరు కాగా 159 మంది గైర్హాజరు అయినట్లు ప్రకటించారు.ప్రవేశ పరీక్షా నిర్వహణకు సహకరించిన శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి జీఎం మునిగంటి శ్రీనివాస్, బెల్లంపల్లి ప్రత్యేక పరిశీలకులు రాందాసు,ఏసీపీ ప్రకాష్,మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లకు,పరీక్ష నిర్వహణ సిబ్బందికి ,రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ,విద్యా, ఆరోగ్య,విద్యుత్ ఇతర శాఖల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# జనగణనను పరిశీలించిన అదనపు డైరెక్టర్



**భీమిని మే 13 జనం సాక్షి** భీమిని మండలంలో జరుగుతున్న జనగణన బుధవారం సెన్సెస్ అదనపు డైరెక్టర్ రాకేష్ కన్నన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణయ్య తో కలిసి మండలంలోని అక్కలపల్లి కర్జి బీమ్పూర్ బిట్టూర్ పల్లి భీమిని గ్రామాల్లో జనగణను పరిశీలించారు. జనగణన చేస్తున్న ఎన్యుమరేటర్లతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు వివరాలను సక్రమంగా నిర్వహించాలని ఇండ్లు ఖాళీ గా ఉండి కుటుంబం మరో చోట నివసిస్తుంటే చుట్టుపక్కల వాళ్లను అడిగి వివరాలు తెలుసుకొని నమోదు చేయాలని. హౌస్ హోల్డ్ సర్వే అనంతరం ఆన్లైన్లో నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని. ఇప్పుడు జరుగుతున్న ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ తో మాట్లాడారు.అదనపు డైరెక్టర్ వెంట తహసీల్దార్ బికర్నదాస్ ఎంపీఎస్ఓ వేణుగోపాల్ సిబ్బంది ఉన్నారు

# విద్యారంగ అభివృద్ధిలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 13(జనంసాక్షి ):**ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక చర్యలు చేపడుతుందని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విద్యాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్ లతో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా వారోత్సవాలపై ఆసిఫాబాద్ నియోజకవర్గ సర్పంచులు, కౌన్సిలర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంపొందించడం అంశాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను ఆదరించడం వలన విద్యార్థుల ప్రవేశాలు పెరిగి చదువు మధ్యలో మానేవేసే పిల్లల సంఖ్య క్రమంగా తగ్గుతుందని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల తల్లిదండ్రులలో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రతినెల పాఠశాలలను సందర్శించడం, బడి వయసు పిల్లలు ప్రభుత్వం పాఠశాలలో చేరేలా చూడడం, ప్రతి నెల నిర్వహించే పేరెంట్స్ కమిటీ సమావేశాలలో పాల్గొనడం, పాఠశాలల పరిశుభ్రతను పర్యవేక్షించడం, పాఠశాలలలో నెలకొన్న చిన్న సమస్యలను పరిష్కరించడం, అందించడం, పాఠశాల విద్యార్థుల ప్రతిభను, విజయాలను ప్రచారం చేయడం, పాఠశాలలను గౌరవంగా చూసుకునేలా సర్పంచులు, కౌన్సిలర్లు, పంచాయతీ పాలకవర్గం భాగస్వాములు కావాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమయపాలన, నాణ్యమైన విద్య బోధనపై పర్యవేక్షిం చాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**స్టేషన్ ఘన్పూర్, మే 13 ( జనం సాక్షి ) :**ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని,రైతులకు ఇబ్బందులు కలగ కుండా కొనుగోలుప్రక్రియ నిర్వహించాలని,ధాన్యం దిగుమతి, రవాణా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవా రం, స్టేషన్ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని, స్టేషన్ ఘన్పూర్, శివుని పెల్లి లో గల ఐకేపీ ధాన్యం కొను గోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్రస్థాయిలో సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి, కొనుగోళ్లకు సంబం ధించిన రిజిస్టర్లను, ఇప్పటివరకు కేంద్రాలకు వచ్చి న ధాన్యం, అందులో ఎంత కొనుగోలు చేశారు, ఎంత మిల్లులకు తరలించారు, లారీల గురించి కలెక్టర్ కేంద్రనిర్వాహకులను అడిగితెలుసుకున్నా రు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎలాంటి ఆల స్యం లేకుండా వెంటనే కొనుగోలు చేసి అన్‌లోడిం గ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగో లు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించా రు. ధాన్యం తూకం, నాణ్యత పరిశీలన పారదర్శ కంగా నిర్వహించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రశీదులు అందజేయాలని తెలిపారు.కేంద్రాల్లో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను సక్రమంగా పరిశీలిస్తూ రైతులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ధాన్యం నిల్వ, రవాణా ప్రక్రియలను వేగవంతం చేసి ఎక్క డా నిల్వలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవా లని సూచించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిం చాలని స్పష్టం చేశారు. ధాన్యం బస్తాల దిగుమతి లో మిల్లుల వద్ద ఒకరు తప్పకుండా బాధ్యత వహించి, త్వరితగతిన దిగుమతి అయ్యేలా చూడా లన్నారు.కొనుగోళ్లకు సంబంధించిన ప్రతి రిజిస్టర్, ట్రక్ షీట్ పక్కాగా నిర్వహించాలని తెలి పారు.సరిపడా హమాలీలను సమాకుర్చుకోవాల ని, లారీలు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కొనుగోలు అయిన ధాన్యం వివరా లను ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో నమోదు చేయాలన్నారు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందు న రైతులు, కేంద్రం నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ఏపీఎంలు, సీసీలు, కేంద్ర నిర్వాహకులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిం చారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటినిర్లక్ష్యం, ఆల స్యం చోటు చేసుకున్నా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత పేరు తో రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధితఅధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 14 సం.రాలు నిండిన ప్రతి బాలిక హెచ్పిపి టీకా వేసుకోవాలి...డా.చీర్ల శ్రీకాంత్



**ములుగు/వెంకటాపూర్,మే13(జనం సాక్షి):**– ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంకటాపూర్ లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఇచ్చే హెచ్పీవీ వ్యాక్సిన్ జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగ అనేష్ సందర్శించి ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్పివి టీకా కార్యక్రమాన్ని ములుగు జిల్లాలో ఉధృతం చేయాలని ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు గ్రామాలలో టీకా ప్రాముఖ్యతను వివరించి 14 సంవత్సరాలు నిండిన బాలికల అందరికీ హెచ్పిపి,టీకాను వేయాలని తెలిపారు .హెచ్పివి వ్యాక్సిన్ వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవని,టీకా పై ఉన్న ,అపోహలను నమ్మొద్దని కోరారు. ఇప్పటి వరకు ములుగు జిల్లాలో దాదాపుగా ఎనిమిది వందల మంది (800)బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ ను ఇచ్చామని తెలిపారు.అటు తర్వాత జిల్లా తల్లి ఆరోగ్యము మరియు పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ క్యాన్సర్లలో గర్భశయ కాన్సర్ రెండో స్థానంలో ఉందని అందులకే తల్లిదండ్రులు వారి పిల్లలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఇప్పించి గర్భాశయ క్యాన్సర్ నివారణకు ముందడుగు వేయాలని కోరారు.తిమ్మాపూర్,కేశవాపూర్,నల్లకుంట వెంకటేశ్వర్ల పల్లె గ్రామాల నుండి వచ్చిన 21 మంది బాలికలకు హెచ్పివి వ్యాక్సిన్ ఇచ్చామని,కార్యక్రమానికి వచ్చిన పిల్లలు మరియు వారి తల్లిదండ్రులకు వేసవికాలంలో వడదెబ్బ తలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించడం జరిగింది.ముఖ్యంగా పనికి వెళ్లే వారు తేలికైన నూలు దుస్తులను ధరించి పని చేయవలసిందిగా,తలకు ఎండ వేడి తగలకుండా వస్త్రాన్ని చుట్టుకోవాల్సిందిగా కోరుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్న వేళలో పిల్లలను ఇంటి వద్దనే ఉండే విధంగా తల్లులు జాగ్రత్త వహించాలని,తరచూ నీటిని తీసుకోవలసిందిగా సూచిస్తూ వారికి అందుబాటులో ఓఆర్ఎస్ డిపోలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేస్తూ ఇతరాత్ర ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాల్సిందిగా డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి సంపత్,వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాడిశెట్టి శ్రీనివాస్ ఫార్మసీ ఆఫీసర్ రాజమణి ఆరోగ్య కార్యకర్తలు మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పసర పోలీస్ స్టేషన్ పరిధిలో, గోవిందరావుపేట మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో, ముగిసిన వాలీబాల్ క్రీడలు



**గోవిందరావుపేట మే జనం సాక్షి ).** 13.05.26.ప్రథమ స్థానం, రంగాపురం, ద్వితీయ స్థానం, ఉప్పలగడ్డ, కన్సోలేషన్ బహుమతులు, పొందిన, ఫ్రూట్ ఫామ్ గోవిందరావుపేట, క్రీడాజట్లకు, బహుమతులు ప్రధానం చేసిన పసర ౹ా × తాజుద్దీన్. ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్, కే కెన్, సూచన మేరకు పసర ౹ా × తాజుద్దీన్ , గోవింద రావుపేట మండల కేంద్రంలో, ప్రభుత్వ బాలికల పాఠశాలలో, నిర్వహించిన వాలీబాల్ క్రీడలు ముగింపు రోజు, విజేతలకు బహుమతి ప్రధానం చేసిన, పసర ౹ా × తాజుద్దీన్. మాట్లాడుతూ, యువత మద్యం మత్తును వీడి, క్రీడల వైపు దృష్టి పెట్టాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మీ బంగారు భవిష్యత్తు, మీ చేతుల్లోనే ఉందని, తెలిపారు, మండల స్థాయిలో జరిగిన క్రీడల్లో, రాణించిన క్రీడాకారులు, ములుగు జిల్లాలో జరిగే, వాలీబాల్ క్రీడల్లో రాణించి,, మన జట్టు ప్రథమ స్థానంలో నిలవాలని తెలిపారు, క్రీడాకారులకు మంచి భోజన వసతి ఏర్పాటు చేశారు,౹ా ణ ఆదినారాయణ, జూ జు ౦ లు, శ్రీనివాస్, కృష్ణ గార్లకు, మెమెంటోలు అందజేశారు,

# తాగునీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తుందని నిత్యం గ్రామాలు పట్టణాల పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. కొంతమంది అభివృద్ధి పనులపై దుష్ప్రచారం చేస్తున్నారని అట్టివారిని సహించేది లేదన్నారు,

ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే జూన్ మాసంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజ్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, ఉద్యానవన శాఖ యూనివర్సిటీ, జెఎన్టియు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, మున్సిపల్ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగం పెంచి ప్రారంభోత్సవం శంకుస్థాపనలకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు, గత సీజన్ తో పోల్చుకుంటే ఈ సీజన్లో మరి ధాన్యం, మొక్కజొన్నల దిగుబడి అధికంగా ఉన్నందున అందుకు తగిన విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని హమాలీలను లారీలను, ట్రాక్టర్స్, డీసీఎం, తదితర సదుపాయాల ద్వారా ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలు చేసి వెంట వెంటనే తరలించాలని సూచించారు. పంట మార్పిడి విధానం పై రైతులకు అవగాహన కల్పించాలని ధాన్యంతో పాటు ఇతర వాణిజ్య పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహించాలని తద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని కోతుల బెడద కూడా లేకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలోని ఐదు మున్సిపల్ ప్రాంతాల అభివృద్ధి కోసం సుమారు 150 నుండి 200 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ ఉంటూ ఉండాలని సూచించారు. జిల్లాలో కొంతమంది నిరుపేదలు అటవీ భూములు, పోడు భూముల సమస్యలు ఉన్నందున అర్హులైన నిరుపేదలు అట్టి భూములలో నివాస స్థలాలు ఏర్పరచుకొని ఉన్నారని వారిని అటవీశాఖ అధికారులు కొంత ఇబ్బందులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, పేద ప్రజల ను ఇబ్బందులకు గురి చేయవద్దని ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న,ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం కోసం ముందస్తు చర్యలు తీసుకొని సాగాలన్నారు.

మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల ద్వారా అభివృద్ధి సాధించుకోవాలని తెలిపారు. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ జిల్లాలో మక్కలు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లాలో తక్కువ శాతం కొనుగోలు అయిందని తెలిపారు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం నిల్వల కోసం గోదాములను పరిశీలించాలని, ధాన్యాన్ని తరలించడం కోసం వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా నియమించుకోవాలని సూచించారు. అనంతరం వారు చెప్పిన సూచనలు సలహాలు స్వీకరించుకుని సంబంధిత అధికారులకు జారీ చేసి ప్రత్యక్షంగా స్వయంగా పనులు సమస్యల పరిష్కారం నిమిత్తం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, జిల్లా ఫారెస్ట్ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ రెడ్డి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, డోర్నకల్, మరిపెడ తొర్రూరు, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్లు , వైస్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## చత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

**చింతల మానేపల్లి మే 13 (జనం సాక్షి )** మండలంలోని కర్జవెల్లి గ్రామంలో ఈ నెల 15న శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ఉంటుందని ఆరెకుల సంక్షేమ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఒడిల భాస్కర్ ప్రకటనలో తెలిపారు ఈరోజు చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను స్థానిక ఎస్సై కమలాకర్ చేతులపై ఆవిష్కరించినట్లు తెలిపారు మన ఆరాధ్య దైవమైన శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణకు జిల్లా కమిటీ సభ్యులు మండల కమిటీ సభ్యులు గ్రామ కమిటీ సభ్యులు మరియు చత్రపతి శివాజీ మహారాజ్ అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## ఆడపిల్ల పెళ్లికి నగదు సహాయం

**నిర్మల్ రూరల్, మే13 (జనంసాక్షి) :** గ్రామ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కాల్వ తాండ గ్రామ సర్పంచ్ జాదవ్ ప్రేమ్ తన సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామంలోని ఓ ఆడపిల్ల వివాహానికి తనవంతు సహకారంగా రూ. 5,06 నగదు పారితోషకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి వచ్చానని, గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లల పెళ్లిళ్లకు సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.



## కొనుగోలు చేసిన వరి ధాన్యం రైస్ మిల్లులకు తరలించాలి



**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**మంచిర్యాల, మే 13 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు త్వరితగతిన తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్ లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా రవాణా శాఖ అధికారి గోపి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ క్రాంతి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్టార్ 1, 2, 3, 4 లకు సంబంధించిన ట్రాన్స్పోర్ట్ గుత్తేదారులతో వరి ధాన్యం కొనుగోలు, ధాన్యం తరలింపు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని, సంబంధిత రైస్ మిల్లర్లు, అధికారులు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 6 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని ఒక రోజులో దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియ అనుసంధానంగా జరగాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యం తరలిస్తున్న లారీలను అటవీ చెక్ పోస్ట్ ల వద్ద ఆపకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, లారీల డ్రైవర్లు, సిబ్బందికి రైస్ మిల్లుల వద్ద త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం ట్యాబ్ లో నమోదు ప్రక్రియ త్వరగా చేపట్టాలని, కొనుగోలు చేసే సమయంలో తడిసిన ధాన్యాన్ని కేటాయించబడిన రైస్ మిల్లులకు మాత్రమే పంపించాలని, రైస్ మిల్లర్ల యజమానులు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులకు సహకరించాలని తెలిపారు. ఆనంతరం కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గాను గోదాముగా మార్చిన దండేపల్లి మండలం లింగాపూర్ లో గల రామ్ లక్ష్మణ్ డిఫాల్టర్ రైస్ మిల్ ను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయబడి కేటాయించబడిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటును అందించాలి

బలమైన పునాది వేయడానికి పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి పలు చారిత్రాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు సహాయ సహకారాలు అందించడం ద్వారా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, ప్రభుత్వ విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, బడిబాట కార్యక్రమం, డిజిటల్ మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అభ్యాస కార్యక్రమాలు, ప్రత్యేక యంగ్ ఇండియా ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఎక్సెలెన్స్ పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం, ప్రీ ప్రైమరీ విద్యా విస్తరణ, బాలికల విద్యను బలోపేతం చేయడానికి కేజీబీవీ పాఠశాలలు, పాఠశాలల నిర్వహణలో పారదర్శకత బాధ్యత వ్యవస్థ నిర్మించడానికి ఎఫ్ ఆర్ ఎస్ సిస్టం వంటి పలు అభ్యర్థి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేయడానికి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. స్థానిక కౌన్సిలర్లు ప్రభుత్వ పాఠశాలలను తరచు పర్యవేక్షిస్తూ పాఠశాలల నిర్వహణ ఉపాధ్యాయుల బోధన పద్ధతులపై దృష్టి పెట్టాలని, విద్యార్థి సంఖ్య పెంపొందించడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల క్రమశిక్షణతో ములుగు జిల్లా పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానాన్ని సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ ఆసియా షాహిన్, జిల్లా అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ



**గూడూరు,మే12(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతనాగరం గ్రామానికి చెందిన బొమ్మగాని శ్రీను శ్రీనగర్ లో సిఆర్పిఎఫ్ జవాన్గా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందగా వారి స్వగ్రామమైన సీతానగరం గ్రామానికి తీసుకురావడంతో బుధవారం వారి స్వగృహానికి వెళ్లి చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు కవిత మాలోత్,మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్.శంకర్ నాయక్ అంతిమ యాత్రలో పాల్గొని పాడెను మోశారు. వారి వెంట గుండు వేణు కుమార్, కటి సుచిత్ర శ్రీనాథ్, హరీష్ గౌతమ్, ఇందుజ రఘు, లెక్కల యాదవ రెడ్డి, ఆకుల రమేష్, గుండగాని ఎల్లగౌడ్, కుల్లా రఘు తదితరులు పాల్గొన్నారు.

